TGTEL/26/A6221




**తొలివెలుగు** జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365


# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ పత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA


**విలేకరులు కావలెను**
**తొలివెలుగు** జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9491134365



యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక: 30 | బుధవారం | 26 ఆగస్టు. 2026 | ఎడిటర్ : యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/-
Yadadri Bhuvanagiri | Volume: 01 | Issue : 30 | Wednesday | 26.08.2026 | Editor: Yamjala Praveen | Pages: 8 | Cost: 2/-




## కేంద్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం

### కొత్త ముఖాలకు చోటు! ఎన్నికల రాష్ట్రాలకు ప్రాధాన్యత

త్వరలో కేంద్ర కేబినెట్ విస్తరణ జరగనున్నట్లు వార్తలు వస్తున్నాయి. త్వరలో ఏడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఉత్తర ప్రదేశ్, గుజరాత్, గోవా, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, పంజాబ్‌లో ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు దేశంలో జెన్–జీ ఉద్యమం సాగుతున్న తరుణంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేయాలని మోడీ భావిస్తున్నట్లుగా వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఇటీవలే బీజేపీ అధ్యక్షుడు నితిన్ నవీన్ కొత్త బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాటు నేపథ్యంలో మోడీ కూడా మంత్రివర్గంలో మార్పులు చేయొచ్చని సమాచారం.

- మిగతా 2వ పేజీలో

## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వైసీపీదే విజయం

- స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకు మాత్రమే సంబంధించినవి కావన్న జగన్
- క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన సమయమని వ్యాఖ్య
- కుటుంబ సభ్యులను బరిలోకి దించేందుకు వెనుకాడవద్దని పిలుపు
- పోటీలు లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని హెచ్చరిక
- పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వ్యాఖ్య

2లో



## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను కాపాడండి

### రాయదుర్గం నియోజకవర్గం కనేకల్ మండలం నల్లంపల్లిలో కార్యకర్తల సమావేశం

- హాజరైన టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్
- కూటమిలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామని హామీ
- పులివెందుల ప్రజల కోసమైనా జగన్ అసెంబ్లీకి రావాలని సవాల్
- కణేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు బాధ్యత తనదేనని ప్రకటన

2లో



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కూటమి శ్రేణులు సమష్టిగా పనిచేయాలని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని కనేకల్ మండలం నల్లంపల్లిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో



## గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

- గోదావరి పుష్కరాల పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వచ్చే ఏడాది జూన్ 26 నుంచి 12 రోజుల పాటు పుష్కరాల నిర్వహణ
- రూ.4,026 కోట్ల అంచనాతో 4,932 పనుల పురోగతిపై చర్చ
- భక్తులకు ప్రపంచస్థాయి వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం
- పుష్కరాల నిర్వహణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం పెంచాలని సూచన

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాట్లు చేయాలని ఆయన స్పష్టం చేశారు. పుష్కరాల పనుల పురోగతిపై సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 2025 జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు జరిగే ఈ మహా వేడుకలను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా

- మిగతా 2వ పేజీలో

## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేరు కానీ..
## విదేశీ విద్య అందిస్తారంట!

- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన బండి సంజయ్
- ఫీజు బకాయిలు అందకపోవడంతో విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతున్నారన్న ఆవేదన
- బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్న సంజయ్

2లో





## ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?

- 22ఏ బాధితుల సమావేశానికి హాజరైన హరీశ్ రావు
- లక్షలాది మందికి కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపాటు
- పొంగులేటి అత్యాశ ఆయన దుఃఖానికి కారణమవుతుందని వ్యాఖ్య

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ (22ఈా) బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టారంటూ ఆవేదనతో ఇక్కడికి

- మిగతా 2వ పేజీలో

## మూసీ ప్రాజెక్ట్‌పై రేవంత్ స్పీడ్..

- అధికారులకు కీలక ఆదేశాలు..
- భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశం
- ల్యాండ్ పూలింగ్‌పై పారదర్శక నిబంధనలు
- ఫేజ్–2 పనులకు త్వరలోనే టెండర్లు
- పర్యాటక అభివృద్ధిపైనా సీఎం ప్రత్యేక ఫోకస్

హైదరాబాద్ నగర ప్రక్షాళనతో పాటు ప్రతిష్టాత్మక మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ ఉన్నతస్థాయి సమావేశంలో హెచ్ఎమ్‌డీఏ, జీహెచ్ఎమ్‌సీ, ఎంఆర్‌డీసీఎల్ కమిషనర్లు, ఎండీలు , రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. మూసీ ప్రాజెక్ట్ పురోగతిని సమీక్షించిన సీఎం, పనుల్లో వేగం పెంచాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

- మిగతా 2వ పేజీలో



## జీవో 77పై రగడ..

- సీఎం రేవంత్ రెడ్డికి థియేటర్ల యజమానుల లేఖ
- టికెట్ ధరల జీవో ఏకపక్షమంటూ సీఎంకు ఎగ్జిబిటర్ల ఫిర్యాదు
- నిబంధనలు నిర్మాతలకు అనుకూలంగా ఉన్నాయని ఆరోపణ
- సింగిల్ స్క్రీన్లను ఏసీలుగా మార్చాలనడం భారమంటున్న ఓనర్లు
- జీవో 77తో గ్రామీణ థియేటర్లు మూతపడతాయని ఆందోళన
- జీవోను సవరించి తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

2లో



## పాక్ అణు కేంద్రం "కిరాణాహిల్స్ " దాడి..

- ఆపరేషన్ సిందూర్ సమయంలో సంచలనంగా మారిన ఘటన..
- భారత డ్రోన్ ఢీకొట్టినట్లు వెల్లడించిన మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్..
- ఉద్దేశపూర్వకంగా దాడి జరగలేదని వెల్లడి..

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ అణ్వాయుధ కేంద్రంగా ఉన్న "కిరాణా హిల్స్"పై దాడి ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది. అయితే, దీని గురించి మాజీ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ సంచలన విషయాన్ని బయటపెట్టారు. పాకిస్తాన్ సర్గోధా సమీపంలోని కిరాణా హిల్స్‌ను భారత్

- మిగతా 2వ పేజీలో

## పాక్ అణు కేంద్రం "కిరాణాహిల్స్" దాడి..

(మొదటి పేజీ తరువాయి)

పంపిన లోయిటరింగ్ మ్యూనిషన్(డ్రోన్) ఢీకొట్టిన విషయం నిజమే అని చెప్పారు. అయితే, కిరాణా హిల్స్‌ను ఉద్దేశపూర్వకంగా అటాక్ చేయలేదని చెప్పారు. రాడార్లను లక్ష్యంగా చేసుకుని పంపిని భారతీయ డ్రోన్, బహుశా ఇజ్రాయిల్ రూపొందించిన హారోప్ డ్రోన్ సర్గోధా చుట్టుపక్కల రాడార్ల కోసం గాలిస్తున్న క్రమంలో ఇంధనం అయిపోయినట్లు జనరల్ అనిల్ చౌహాన్ చెప్పారు. ఇప్పటికే ఎయిర్ మార్షల్ ఏకే భారతి కిరాణా హిల్స్ టార్గెట్ జరగలేదని చెప్పారని, ఇప్పుడు తాను కూడా ఇదే వివరణ ఇవ్వగలనని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా దాడులకు ముందు సర్గోధా, కిరానా హిల్స్ ప్రాంతాల్లోకి అనేక లోయిటరింగ్ మ్యూనిషన్లను పంపినట్లు ఆయన చెప్పారు. సర్గోధాకు సుమారు 10 కిలోమీటర్ల ఉత్తరాన కిరానా హిల్స్ ఉన్నట్లు వివరించారు. నిర్దిష్టమైన ఆపరేషన్ కోసం సమయం ఉంటుందని, సుమారు రెండు గంటల పాటు గాలిస్తుంది, టార్గెట్ కనిపించకుంటే చివరకు ఎక్కడో చోట ఢీకొడుతుంది. ఇలా కిరాణా హిల్స్‌లోని కొండల్లో ఒక దాన్ని ఢీకొట్టి ఉండొచ్చని చెప్పారు. ఆక్రమిత కాశ్మీర్‌లోని స్కార్డుపై దాడి చేసేందుకు భారత వైమానిక దళానికి అనుమతి ఇచ్చినట్లు జనరల్ చౌహాన్ వెల్లడించారు. అయితే ప్రతికూల వాతావరణం కారనంగా ఆ దాడిని నిలిపేసినట్లు చెప్పారు. దీంతో భోలారిపై దాడి చేశామని చెప్పారు. మే 10న జరిగిన వైమానిక దాడుల్లో భోలారీలోని హ్యాంగర్లపై భారత వైమానిక దళం జరిపిన దాడి అత్యంత కీలకమైందిగా నిలిచింది. ఈ దాడిని గాంధీనగర్‌లోని సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ నిర్వహించింది. భోలారిలో ఉన్న హ్యాంగర్లతో పాటు రన్‌వేపై పెద్ద గోతులు ఏర్పడటం అప్పట్లో వైరల్ అయ్యాయి.

## గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రవాణా, పారిశుద్ధ్యం, నిరంతరాయ తాగునీటి సరఫరా, వైద్య సేవలు, భద్రత, వసతి కల్పనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. పుష్కరాల నిర్వహణ అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా ఒక ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పుష్కరాల కోసం రూ.4,026 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 4,932 పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఘాట్ల నిర్మాణం, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేరు కానీ..

## విదేశీ విద్య అందిస్తారంట!

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉన్న విద్యా సంస్థలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని... అలాంటప్పుడు విదేశీ విద్యను అందిస్తామని, ప్రపంచ ప్రఖ్యాత విద్యా సంస్థలను రాష్ట్రానికి రప్పిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఫీజు బకాయిలు అందకపోవడంతో రాష్ట్రంలో అనేక కళాశాలలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయని బండి సంజయ్ తెలిపారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని, అయినా సీఎంకు పట్టకపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు. బకాయిలు అడిగిన కళాశాల యాజమాన్యాలను బెదిరించడం తప్ప ప్రభుత్వం చేసిందేమీ లేదని, ఈ రీయింబర్స్‌మెంట్ నిలిచిపోవడం వల్ల ముఖ్యంగా దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకేసారి (వన్ టైం సెటిల్‌మెంట్) బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. హామీలు ఇచ్చి మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ సర్కార్‌ను మించిపోతోందని విమర్శించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించే వరకు తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో తలెత్తే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

## ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?

(మొదటి పేజీ తరువాయి)



వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. "భూములను 22ఏలో పెట్టడం మీ వంతు.. మళ్లీ వాటిని తొలగించుకోవడానికి దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రజల వంతా?" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సూటిగా నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సవరించాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉందన్నారు. లక్షలాది మంది ఆస్తులను రాత్రికి రాత్రి 22ఏ జాబితాలో చేర్చి, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపడ్డారు. 30 శాతం కమీషన్ల దురాశతోనే ఈ భూములన్నింటినీ 22ఏలో పెట్టారంటూ హరీశ్ రావు ఆరోపించారు. మంత్రి అత్యాశ ఏదో ఒకరోజు ఆయన దుఃఖానికి కారణమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ కుట్రల వల్ల లక్షలాది మంది జీవితాలు నాశనమవుతున్నాయని... పిల్లల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, దవాఖాన ఖర్చుల కోసం ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెడదామంటే బ్యాంకులు సైతం తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాపర్టీల విలువలు పడిపోయి, అప్పు పుట్టక, ఆస్తులు అమ్ముకోలేక బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాబట్టి ప్రజలతో ఆన్‌లైన్ దరఖాస్తులు పెట్టించకుండా, ప్రభుత్వం వెంటనే ఈ 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# కేంద్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

రాబోయే కొద్ది నెలల్లోనే ఈ మార్పు జరగవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మంత్రివర్గంలో యువత సంఖ్య పెరిగే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ప్రస్తుతం డెబ్బై ఏళ్లు పైబడిన 12 మంది కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులు స్వతంత్ర బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 81 ఏళ్ల జితన్ రామ్ మాంఝీ అత్యంత పెద్ద వయసున్న మంత్రి కాగా.. 38 ఏళ్ల రామ్ మోహన్ నాయుడు అత్యంత పిన్న వయస్కుడు ఉన్నారు. ఇటీవల ముగ్గురు మంత్రులు కూడా రాజీనామా చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టు రిజైన్ చేశారు. దీంతో ప్రస్తుతం 29 మంది కేబినెట్ మంత్రులు, స్వతంత్ర బాధ్యతలు కలిగిన ఐదుగురు సహాయ మంత్రులు, 34 మంది సహాయ మంత్రులు ఉన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 75(1ఎ) ప్రకారం గరిష్టంగా 81 మంది సభ్యులు ఉండవచ్చు. దీంతో 12 పదవులు ఖాళీగా ఉన్నాయి. దీంతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగొచ్చని పేర్కొన్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలువురు ప్రస్తుత మంత్రులను తొలగించే అవకాశం కూడా ఉంది. ఉదాహరణకు ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా, ఉత్తర ప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి వంటి ఇద్దరు సహాయ మంత్రులు నియమితులయ్యారు. వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను బీజేపీ కోశాధికారిగా కూడా నియమించారు. పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, సాంఘిక న్యాయ శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మల రాజ్యసభ పదవీకాలం నవంబర్‌లో ముగుస్తుంది. పనితీరు ఆధారంగా కూడా కొంతమంది మంత్రులను తొలగించే అవకాశం ఉంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేసేటప్పుడు 2029 లోక్‌సభ ఎన్నికలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో కొత్త మిత్రపక్షాలకు చోటు దక్కవచ్చని కూడా ప్రచారం జరుగుతోంది. డీఎంకే, ఎన్‌సీపీ-ఎస్పీ, అకాలీ దళ్‌లు ఎన్‌డీఏలో చేరతాయో లేదోనని అందరి దృష్టి వాటిపైనే ఉంది. టీఎంసీ రెబెల్స్ ఏర్పాటు చేసిన ఎన్‌సీపీ నుంచి ఒక మంత్రిని నియమించవచ్చని కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పంజాబ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలలో ఒకరిని మంత్రివర్గంలో చేర్చుకోవచ్చని సమాచారం. అదనంగా శివసేనకు కూడా మంత్రి పదవి లభించవచ్చు. ఎందుకంటే శివసేన యూబీటీకి చెందిన ఆరుగురు ఎంపీలు చేరడంతో ఆ పార్టీ బలం 13కి పెరిగింది. శివసేన నుంచి శ్రీకాంత్ షిండే పేరు వినిపిస్తోంది. ఈ మంత్రివర్గంలో మహిళలు, యువత సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇక మంత్రివర్గంలో ప్రస్తుతం పద్నాలుగు మంది మంత్రులు ఒకటి కంటే ఎక్కువ మంత్రిత్వ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ మంత్రుల్లో అమిత్ షా, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్, హెచ్‌డి కుమారస్వామి, పీయూష్ గోయల్, లల్లన్ సింగ్, ప్రహ్లాద్ జోషి, అశ్విని వైష్ణవ్, జ్యోతిరాదిత్య సింధియా, గజేంద్ర సింగ్ శేఖావత్, కిరణ్ రిజిజు, మన్సుఖ్ మాండవియా, కిషన్ రెడ్డి బహుళ పోర్ట్‌ఫోలియోలను నిర్వహిస్తున్నారు. తత్ఫలితంగా కొంతమంది మంత్రులపై పనిభారం తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కొత్త ముఖాలను కేబినెట్‌లోకి తీసుకురావాలనే చర్చ జరుగుతోంది. త్వరలోనే ఈ ప్రక్రియ జరగొచ్చని తెలుస్తోంది.



## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వైసీపీదే విజయం

స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైసీపీ అధినేత జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని... క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్న ఆయన.. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబ సభ్యులను సైతం బరిలోకి దించేందుకు వెనకాడకూడదని పిలుపునిచ్చారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని... ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కో-ఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు. పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని... సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ -- వెన్నుపోటు పాలన' అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసీపీ - కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్‌ను బలోపేతం చేయాలని... అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, 'జగన్ 2.0 సూపర్ యాప్', యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను కాపాడండి..

లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "ఈ రోజు మేము మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా మీ ముందు నిలబడ్డామంటే దానికి కారణం కార్యకర్తల త్యాగాలు, శ్రమే. ముఖ్యంగా 2019-24 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వ దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులను ఎదుర్కొని కూడా పసుపు జెండాను దించకుండా పోరాడిన మీరే పార్టీకి అసలైన బలం. అందుకే టీడీపీలో కార్యకర్తే అధినేత" అని లోకేశ్ అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం దేశంలో ఏ పార్టీ చేయని విధంగా బీమా సౌకర్యం కల్పించి, ఇప్పటివరకు రూ.160 కోట్లు ఖర్చు చేశామన్నారు. యువగళం పాదయాత్రలో కార్యకర్తలు కోరినట్లే, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు 'మైటీడీపీ' యాప్‌ను తీసుకొచ్చామని తెలిపారు. "మీరు పాల్గొనే ప్రతి కార్యక్రమం, మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ నేరుగా మాకు చేరుతుంది. కొత్త పెన్షన్లు, ఇళ్ల మంజూరు వంటివి కార్యకర్తల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే ప్రభుత్వ దృష్టికి తీసుకెళుతున్నాం. కష్టపడే కార్యకర్తను మేమే వెతుక్కుంటూ వస్తాం. ఎక్కడైనా సమస్య పరిష్కారం కాకపోతే, మీకు అండగా నేనుంటాను" అని హామీ ఇచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీకి కంచుకోట అని, తమ కుటుంబాన్ని ఎల్లప్పుడూ ఆదరించిందని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "ఎన్టీఆర్‌ను, హరిమామను, మా బాల మావయ్యను గెలిపించిన గడ్డ ఇది. ఈ అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాను. అనంతపురం జిల్లా అభివృద్ధి నా బాధ్యత" అని స్పష్టం చేశారు. సోలార్, విండ్ ఎనర్జీ, ఫైటర్ జెట్ తయారీ సంస్థ వంటి పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఉరవకొండలో తయారయ్యే విండ్‌మిల్‌పై 'మేడ్ ఇన్ ఉరవకొండ' అని మంత్రి కేశవ్ సంకల్పం పెట్టుకున్నారని, ఇదే స్ఫూర్తితో ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల అభివృద్ధికి పోటీ పడాలని సూచించారు. ఈ సందర్భంగా, కనేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. వైసీపీపై లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "గొడ్డలి పార్టీతో మనం రాజకీయంగా పోరాడుతున్నాం. సొంత బాబాయ్‌ని హత్య చేసి, ఆ నిందను ఇతరులపై వేయడం వారి నైజం. కోడికత్తి, గులకరాయి డ్రామాలు ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ఇప్పుడు లిక్కర్ స్కామ్‌లో వారి మాజీ మంత్రిని ఈడీ అరెస్ట్ చేస్తే, దానికి కూడా మమ్మల్ని నిందిస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌కు ఆయన సవాల్ విసిరారు. "డీఎస్సీ, ఏపీపీఎస్సీకి తేడా తెలియని జగన్, డీఎస్సీపై చర్చకు సిద్ధమా? టైమ్, డేట్, లొకేషన్ నువ్వే ఫిక్స్ చెయ్. ప్రెస్‌మీట్లు కాదు, దమ్ముంటే అసెంబ్లీకి రా. పులివెందుల ప్రజలు నిన్ను గెలిపించింది వారి సమస్యలు సభలో ప్రస్తావించడానికే. కానీ రెండేళ్లలో ఒక్కసారి ప్రమాణ స్వీకారానికి వచ్చి వెళ్లిపోయావు. పులివెందుల ప్రజల కోసమైనా అసెంబ్లీకి రా" అని లోకేశ్ సవాలు చేశారు. కూటమిలో చిచ్చు పెట్టేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని లోకేష్ హెచ్చరించారు. "జనసేన, బీజేపీ పేరుతో టీడీపీని తిడుతూ సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు పెడుతున్నారు. వాటిని నమ్మి ఆవేశపడొద్దు. మనమంతా ఐక్యంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి వేగంగా సాధ్యమవుతుంది" అని దిశానిర్దేశం చేశారు.

## మూసీ ప్రాజెక్ట్‌పై రేవంత్ స్పీడ్..

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ల్యాండ్ పూలింగ్ విధానంపై పారదర్శకమైన నిబంధనలను రూపొందించుకోవడంతో పాటు ఎఫ్టీఎల్ (ఖీూ), బఫర్ జోన్ , అసైన్డ్ భూముల సేకరణ విషయంలో స్పష్టమైన విధానాన్ని తయారు చేసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ సమయంలో భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్ ఫేజ్-2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని, ప్రాజెక్టుల నిర్మాణానికి అతి తక్కువ వడ్డీకి లభించే రుణాలపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. అంతేకాకుండా టీడీఆర్ (ꠃఐ=) కేటాయింపులపై ప్రతి వారం సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రాజెక్ట్‌తో పాటు పరిసర ప్రాంతాల పర్యాటక అభివృద్ధిపై ఫోకస్ పెట్టిన సీఎం, మంచిరేవులలోని ఓంకారేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి టెండర్లను తక్షణమే ఆహ్వానించాలని, కొత్వాల్‌గూడా బర్డ్స్ పార్క్‌కు ప్రచారం కల్పించి పర్యాటకులను ఆకట్టుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## జీవో 77పై రగడ.. సీఎం రేవంత్ రెడ్డికి థియేటర్ల యజమానుల లేఖ

తెలంగాణలో సినిమా టికెట్ ధరల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో 77పై వివాదం ముదురుతోంది. ఈ జీవో ఏకపక్షంగా ఉందని, కేవలం నిర్మాతలకు మేలు చేసేలా రూపొందించారని ఆరోపిస్తూ తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసింది. స్టేట్ ఫిల్మ్ ఛాంబర్, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి కీలక భాగస్వామ్య పక్షాలను సంప్రదించకుండా, కేవలం తెలుగు యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. టికెట్ ధరల పెంపు వల్ల ఎగ్జిబిటర్లకు ఎటువంటి లాభం లేదని, థియేటర్ల నిర్వహణ, సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు వంటి ఆర్థిక భారాలన్నింటినీ తామే భరిస్తున్నామని వారు స్పష్టం చేశారు. కరోనా అనంతర కాలంలో ప్రేక్షకులకు మెరుగైన అనుభూతిని అందించేందుకు గత మూడేళ్లలో సుమారు రూ. 300 కోట్లు వెచ్చించి థియేటర్లను ఆధునికీకరించామని, అయితే ప్రస్తుత నిబంధనల వల్ల టికెట్ ధరలను నిర్ణయించే హక్కును కూడా కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.నూతన నిబంధనల ప్రకారం టైర్-2, టైర్-3 పట్టణాల్లోని ఎయిర్-కూల్డ్ థియేటర్లను ఏసీ థియేటర్లుగా మార్చాలంటే ఒక్కో స్క్రీన్‌కు సుమారు రూ. 60 నుండి 80 లక్షల వరకు వ్యయమవుతుందని, ఈ ఆర్థిక భారాన్ని భరించలేక ఇప్పటికే అనేక థియేటర్లు మూతపడ్డాయని వారు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 400కు పైగా సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉండగా, వాటిపై సుమారు 20,000 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ జీవో అమలులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని థియేటర్లు మూతపడి, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, చిత్ర పరిశ్రమకు వెన్నెముకగా నిలిచే ఎగ్జిబిటర్ల ప్రయోజనాలను కాపాడే విధంగా జీవో 77ను పునఃసమీక్షించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, ఆయన చొరవ తీసుకుని తమ సమస్యలను పరిష్కరిస్తారని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.



## ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదు

- నాపై కేసును కొట్టివేసిన కోర్టు: కేతావత్ రమేష్ నాయక్

**తొలివెలుగు, వనస్థలిపురం :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షతో తనపై మోపిన అక్రమ కేసును గౌరవ న్యాయస్థానం కొట్టివేసిందని సాహెబ్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేతావత్ రమేష్ నాయక్ వెల్లడించారు. మంగళవారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజానిజాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ నాయకురాలు విద్యారెడ్డి తనపై, తన కుటుంబంపై పదేపదే అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. 2021 నుంచి ఎల్‌బీనగర్ ఎస్టీ సెల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు లేని అభ్యంతరాలు, డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాతే రావడంలో రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. లంబాడా సామాజిక వర్గానికి చెందిన తన ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా మాట్లాడటంతోనే స్వచ్ఛందంగా వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదైందని తెలిపారు.

## లోన్ యాప్‌ల వేధింపులకు ఆర్ఎంపీ బలి

- ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం
- బాధితుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు



**తొలివెలుగు, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఆర్థిక ఇబ్బందులు, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల వేధింపులతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఒక ఆర్ఎంపీ వైద్యుడు అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన బల్ల సత్యనారాయణ ప్రసాద్ (49) ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలు అందిస్తూ, కవాడిపల్లి రోడ్డులోని వీవీఎం గ్రాండ్ వద్ద 'సత్య ప్రసాద్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్' నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆయన, తెలిసిన వారి వద్ద చేతి అప్పులతో పాటు ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్నారు. సమయానికి రుణాలు చెల్లించలేకపోవడంతో రికవరీ ఏజెంట్ల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురైంది. దీంతో తీవ్ర మానసిక ఆందోళనకు గురైన ఆయన పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యుల వద్ద వాపోయినట్లు తెలిసింది. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసి షాప్‌కు వెళ్లిన సత్యనారాయణ ప్రసాద్ ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో పాటు, మొబైల్ ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ కావడంతో ఆందోళన చెందిన భార్య సవిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

## ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి

- సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం సమావేశంలో నాయకుల పిలుపు

**తొలివెలుగు, రామన్నపేట :** గ్రామీణ వైద్యులు కేవలం ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితమై వైద్యం అందించాలని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య గౌడ్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం సమావేశానికి స్థానిక ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులంతా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 'ఆడపిల్లను (అమ్మను) కాపాడుకుందాం' అనే సత్సంకల్ప నినాదంతో తమ సంఘం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ప్రాథమిక సేవలు అందిస్తూనే, తమ పరిమితులకు లోబడి వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా సంఘ వ్యవస్థాపకుడు డి.ఎస్.ఎన్.చారి, యాదాద్రి జిల్లా ఆర్గనైజర్ రొయ్యల శంకర్, మండల అధ్యక్షుడు ఉయ్యాల కృష్ణమూర్తి గౌడ్, ప్రధాన కార్యదర్శి కె.వి.సుధాకర్ రాజు, కోశాధికారి మధు, నాయకులు కరుణాకర్, ఎస్.పి.రాయ్, నాగేశ్వర్, భిక్షపతి, అంజయ్య, రామేశ్వరం, యాదగిరి, నరసింహ, రమేష్, వినయ్ పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీజులు వెంటనే చెల్లించాలి

- రామచందర్‌రావు నిరాహార దీక్షకు మద్దతు
- నకిరేకంటి మొగులయ్య డిమాండ్

**తొలివెలుగు, రామన్నపేట :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నకిరేకంటి మొగులయ్య డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు ఆయన పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజులు విడుదల కాకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ప్రభుత్వం స్పందించి తక్షణమే బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండ మధుకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వనం అంజయ్య, నకిరేకంటి రవి తదితరులు పాల్గొని దీక్షా శిబిరానికి సంఘీభావం తెలిపారు.




# అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు





- పేదలకు సన్నబియ్యం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**తొలివెలుగు, రామన్నపేట :** అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. రామన్నపేట మండల కేంద్రంలోని జీఆర్ఎం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తహశీల్దార్ లాల్ బహదూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్లలో అర్హులైన అనేక కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు కాలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే అర్హులందరికీ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని స్పష్టం చేశారు. రామన్నపేట పట్టణంలోని పేదలకు త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ. రాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరొద్దీన్, మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మోటె రమేష్, సర్పంచులు మల్లారెడ్డి, రామకృష్ణ, స్థానిక వార్డు సభ్యులు, నాయకులు గంగుల వెంకటరాజురెడ్డి, మహేందర్ రెడ్డి, జెల్లా వెంకటేశం, వనం చంద్రశేఖర్, సాల్వేరు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువును ముంచేస్తున్న రియల్ మాఫియా!

- నామరూపాలు లేకుండా మల్లాయి చెరువు..?
- చెరువు శిఖం, కట్ట తొలగిస్తున్నారంటూ రైతులు, గ్రామస్తుల ఆందోళన
- జేసీబీ పనులను అడ్డుకున్న స్థానికులు.. పంచాయతీకి ఫిర్యాదు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం చల్లూరు రెవెన్యూ పరిధిలోని మల్లాయి చెరువు ఉనికినే ప్రశ్నార్థకం చేసేలా రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేపడుతున్న పనులను రైతులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. చెరువు సమీపంలోని పట్టా భూమిని కొనుగోలు చేసిన కొందరు రియల్ వ్యాపారులు జేసీబీలతో పనులు చేపట్టగా, చెరువు శిఖం భూమితో పాటు కట్టను కూడా తొలగిస్తున్నారంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 223, 224లో సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో మల్లాయి చెరువు ఉంది. చెరువు సమీపంలోని పట్టా భూమిని రియల్ వ్యాపారులు కొనుగోలు చేసి అభివృద్ధి పనుల పేరుతో జేసీబీలను వినియోగిస్తూ భూమిని చదును చేస్తున్నట్లు రైతులు ఆరోపించారు. అయితే ఈ పనుల క్రమంలో చెరువు శిఖంలో ఉన్న సుమారు రెండు ఎకరాల భూమిని తొలగించడంతో పాటు చెరువు కట్టను కూడా ధ్వంసం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో చెరువు నామరూపాలు లేకుండా పోయే పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం



తెలుసుకున్న రైతులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ పనులను అడ్డుకున్నారు. చెరువు భూమి, కట్టలను తొలగించే పనులను వెంటనే నిలిపివేసి మల్లాయి చెరువును కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై గ్రామపంచాయతీకి ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సంబంధిత రెవెన్యూ అధికారులు చెరువు సరిహద్దులను పరిశీలించి, వాస్తవ పరిస్థితులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యపై సోమవారం నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్)






కార్యక్రమంలో కూడా ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు, గ్రామస్తులు వెల్లడించారు.

# కానిస్టేబుల్స్ సంఘం అధ్యక్షుడిగా రామాచారి ఘనవిజయం

- రామన్నపేట సర్కిల్ పరిధిలో ఎన్నికలు
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: రామాచారి

**తొలివెలుగు, రామన్నపేట:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా రామన్నపేట సర్కిల్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏ. రామాచారి అత్యధిక ఓట్లతో ఘన విజయం సాధించారు. మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో స్థానిక సీఐ ఎం. రవి ఎన్నికల అధికారిగా వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. రామన్నపేట సర్కిల్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన కానిస్టేబుళ్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీ పడగా, ఏ. రామాచారి అత్యధిక ఓట్లు సాధించి విజయం సాధించారు. ఈ సందర్భంగా రామాచారి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కానిస్టేబుళ్ల సంక్షేమంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రామాచారిని తోటి పోలీసు సిబ్బంది ఘనంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.




## పీఆర్‌సీ ప్రకటించి.. డీఏలు విడుదల చేయాలి

- 27న కలెక్టరేట్ వద్ద ధర్నా: టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీసం నరేందర్
- ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు



**తొలివెలుగు, రామన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన రెండో పీఆర్‌సీని వెంటనే ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలని టీపీఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు వీసం నరేందర్ డిమాండ్ చేశారు. టీజీఈజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 27న భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా చేపడుతున్నట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ధర్నాలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రధానంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. రెండో పీఆర్‌సీని వెంటనే ప్రకటించి ఉద్యోగులకు న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించి, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరసన ధర్నాకు జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని వీసం నరేందర్ పిలుపునిచ్చారు.

## కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామాచారి విజయం

- ఎన్నికల అధికారిగా సీఐ ఎం. రవి
- నూతన అధ్యక్షుడికి ఘనంగా సన్మానం

**+తొలివెలుగు, రామన్నపేట:** తెలంగాణ రాష్ట్ర పోలీసు అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా రామన్నపేట సర్కిల్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏ. రామాచారి అత్యధిక ఓట్లతో విజయం సాధించారు. స్థానిక సీఐ ఎం. రవి ఎన్నికల అధికారిగా వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. అధ్యక్ష పదవికి మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీ పడగా, అత్యధిక ఓట్లు సాధించిన రామాచారి విజయం సాధించారు. ఎన్నికల ప్రక్రియ అనంతరం ఆయనను నూతన అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఏ. రామాచారిని పోలీసు సిబ్బంది, మిత్రులు మిర్జా ఇనాయత్ బేగ్, మోటె నరేష్ తదితరులు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.





# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జే. రామచంద్రనాయక్
- చిన్నగూడూరులో మండల సర్వసభ్య సమావేశం

**తొలివెలుగు, చిన్నగూడూరు :** మండల సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జే. రామచంద్రనాయక్ అన్నారు. చిన్నగూడూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రజిని అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న పనుల పురోగతితో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు కూడా గ్రామాల్లోని సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రామచంద్రనాయక్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్, ఏపీఓ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ కిరణ్, రెవెన్యూ అధికారులతో పాటు వివిధ శాఖల సిబ్బంది, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

- మొక్కలు నాటి సంరక్షించాలి: ఉపసర్పంచ్ అబ్దుల్ ఆబిద్



**తొలివెలుగు, రాజాపేట :** ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా భవిష్యత్తు తరాలకు బంగారు బాట వేయాలని రాజాపేట మండలం బొందుగుల గ్రామ ఉపసర్పంచ్ అబ్దుల్ ఆబిద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని బొందుగుల గ్రామంలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ అబ్దుల్ ఆబిద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కల పెంపకం అత్యంత కీలకమని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా అవి ఎదిగి పెద్దవయ్యే వరకు ప్రతి ఒక్కరూ వాటిని సంరక్షించాలని సూచించారు. పచ్చదనం పెంపొందితేనే పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని పేర్కొన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఫీల్డ్ ఆఫీసర్ మల్లేశం, వార్డు సభ్యులు శీను, వెంకటేష్, శ్రీధర్, గ్రామస్తులు సిద్ధులు, కిషన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


# పచ్చదనం దిశగా దూది వెంకటాపురం

- వనమహోత్సవంలో భాగంగా మాస్ ప్లాంటేషన్
- సర్పంచ్ నరేష్ నేతృత్వంలో మొక్కల నాటిన స్థానికులు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల పరిధిలోని దూది వెంకటాపురం గ్రామంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మాస్ ప్లాంటేషన్ (బృహత్ మొక్కల పెంపకం) కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంగణాల్లో సర్పంచ్ నడిమింటి నరేష్ నేతృత్వంలో స్థానికులు, గ్రామపంచాయతీ సిబ్బంది, అధికారులు కలిసికట్టుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరేష్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం అత్యంత అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాంధీ, టీఏ శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉమ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



# నకిలీ పత్రాల దందా.. నమిలలో అక్రమాల పర్వం!




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
Government of Telangana State
మరణ ధృవ పత్రము
CERTIFICATE OF DEATH

| | | | |
|---|---|---|---|
| 1 | పేరు | | |
| 2. | తండ్రి / భర్త | : | |
| 3. | ఆడ / మగ | : | |
| 4. | మరణించిన తేది | : | 22/10/2019 |
| 5. | మరణించిన ప్రదేశము | : | |
| 6. | రిజిస్ట్రేషన్ నెంబరు | : | 17/2020 |
| 7. | రిజిస్ట్రేషన్ తేది | : | 09/11/2020 |

తేది
Date

Panchayath Secretary
G. P. Nemila, Mdl. Rajapet,
Dt. Yadadri Bhongir.

Scanned with OKEN Scanner





- నిజామాబాద్‌లో మరణిస్తే.. నమిలలో మరణ ధ్రువీకరణ?
- లేని స్థలాలకు పత్రాలు సృష్టించి అక్రమ ఆస్తి మార్పిడుల ఆరోపణలు
- మాజీ కార్యదర్శి నవీన్‌పై గ్రామస్తుల తీవ్ర ఆరోపణలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులంటూ ఆగ్రహం

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలంలోని నమిల గ్రామపంచాయతీ కేంద్రంగా నకిలీ ధ్రువీకరణ పత్రాల వ్యవహారం కలకలం రేపుతోంది. ఎక్కడో మరణించిన వ్యక్తికి నమిల గ్రామంలో మృతి చెందినట్లు ధ్రువీకరణ పత్రాలు సృష్టించడంతో పాటు, ఉనికిలో లేని ఇళ్ల స్థలాలకు సైతం పత్రాలు తయారు చేసి అక్రమ ఆస్తి మార్పిడులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో నమిల గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన నవీన్‌పై స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాలో మృతి చెందిన సరోజ అనే మహిళ 2019 అక్టోబర్ 22న నమిల గ్రామంలోనే మరణించినట్లు పంచాయతీ రికార్డుల్లో ధ్రువీకరణ పత్రం సృష్టించి జారీ చేసినట్లు ఆరోపిస్తున్నారు. అసలు వేరే ప్రాంతంలో మృతి చెందిన వ్యక్తికి నమిల గ్రామపంచాయతీ పరిధిలో మరణించినట్లు పత్రం ఎలా జారీ చేశారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### లేని స్థలాలకు పత్రాలే పత్రాలు!

గ్రామంలో అసలు ఉనికిలో లేని ఇళ్ల స్థలాలకు సైతం నకిలీ పత్రాలు సృష్టించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొందరు వ్యక్తులకు స్థలాలు ఉన్నట్లు కాగితాలు తయారు చేసి, వాటి ఆధారంగా అక్రమ ఆస్తి మార్పిడులు జరుపుతున్నారని విమర్శిస్తున్నారు. ఈ పత్రాల కారణంగా గ్రామంలో భూ సరిహద్దు వివాదాలు పెరిగి ఘర్షణ వాతావరణం నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై గతంలోనే ఎంపీడీవో, ఎంపీఓలకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులపై విచారణ జరిపి వాస్తవాలను తేల్చాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు.

### సమగ్ర విచారణ జరపాలని డిమాండ్:

నమిల గ్రామపంచాయతీలో గతంలో జారీ చేసిన మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి స్థలాలకు సంబంధించిన రికార్డులు, ఆస్తి మార్పిడి పత్రాలపై సమగ్ర విచారణ జరిపించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో నిజానిజాలను వెలికితీసి, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే ఉన్నతస్థాయి అధికారులను ఆశ్రయిస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.



# ఆధ్యాత్మిక శోభతో 'మణిద్వీప వర్ణన' పారాయణం

- మణిద్వీప పారాయణంలో మహిళల భక్తిపరవశం
- ఏకరూప దుస్తులతో అలరించిన భక్తులు
- తీర్థప్రసాద వితరణ.. సామూహిక భోజనాలు

**తొలివెలుగు, రాజాపేట:** రాయగిరిలోని సోమరాధ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన మణిద్వీప వర్ణన పారాయణ పూజా కార్యక్రమం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల కేంద్రానికి చెందిన జై శ్రీమన్నారాయణ, ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిపరవశులయ్యారు. శ్రీ శైవ క్షేత్ర వనితా శక్తి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలోని 'ధర్మో రక్షతి రక్షితః' ట్రస్ట్ నిర్వహణలో సముద్రాల అంజమ్మ నాయకత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో మణిద్వీప వర్ణన పారాయణం చేశారు. కార్యక్రమానికి హాజరైన మహిళలంతా ఒకే రకమైన సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తి గీతాలు, పారాయణాలతో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు. రాజాపేట ప్రాంతానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# నరసాపురం అడవుల్లో 'మాస్ ప్లాంటేషన్'

- వనమహోత్సవంలో మొక్కలు నాటిన అటవీ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు

**తొలివెలుగు, రాజాపేట:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాజాపేట మండలం నరసాపురం గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో మంగళవారం భారీ స్థాయిలో మొక్కలు నాటారు. వనమహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మాస్ ప్లాంటేషన్ (బృహత్ మొక్కల పెంపకం) కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు. అటవీ భూముల్లో పచ్చదనాన్ని మరింత పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎమ్మా శిరీష నాగరాజు, ఉపసర్పంచ్ నారపాక కరుణాకర్, వార్డు సభ్యుడు నీల ప్రతాప్, ఏఈసీ కరుణాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్మ రామచంద్రం, అటవీ శాఖ అధికారులు, గౌడ సంఘం అధ్యక్షుడు బొంగోని నర్సింలు, రైతులు, స్థానిక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగులు









- అపోహలు వీడి స్వచ్ఛందంగా ముందుకు రావాలి
- ప్రజాఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ కె. శశిశ్రీ
- వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో నేత్రదాన అవగాహన ర్యాలీ

**తొలివెలుగు, దిల్‌సుఖ్‌నగర్ :** నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు, అపనమ్మకాలను తొలగించి, మరింత మంది స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ (అడ్మిన్) కె. శశిశ్రీ పిలుపునిచ్చారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాన్ని పురస్కరించుకుని వాసన్ ఐ బ్యాంక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మూసారాంబాగ్‌లో భారీ నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మరణానంతరం చేసే నేత్రదానం మరొకరి జీవితంలో వెలుగు నింపుతుందని శశిశ్రీ పేర్కొన్నారు. ఈ సామాజిక ఉద్యమం కేవలం ఆసుపత్రుల గోడలకే పరిమితం కాకుండా సమాజంలో విస్తృతంగా ప్రచారం కావాలని సూచించారు. తెలంగాణ ఐ, ఆర్గాన్ అండ్ బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం మాట్లాడుతూ.. నేత్రదాన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్లు భాగస్వాములు కావాలన్నారు. సురభి మెడికల్ కాలేజ్ అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ సమతా రోషిణి మాట్లాడుతూ సమష్టి కృషితోనే అంధత్వ నిర్మూలన సాధ్యమని తెలిపారు. వాసన్ ఐ కేర్ వైద్యులు డాక్టర్ హారిక, డాక్టర్ మనోజ్ నేత్రదాన ప్రాముఖ్యతను వివరించారు.

### దేశంలో 12 లక్షల మంది కార్నియా అంధులు:

దేశంలో అవగాహన లోపం వల్ల దాతల సంఖ్య తక్కువగా ఉంద ని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో సుమారు 12 లక్షల మంది కార్నియా అంధత్వంతో బాధపడుతుండగా, ప్రతి ఏటా కొత్తగా 40 వేల మంది ఈ జాబితాలో చేరుతున్నారని తెలిపారు. అంధత్వాన్ని నివారించాలంటే ఏటా 2 లక్షల కార్నియాలను సేకరించి, లక్ష శస్త్రచికిత్సలు చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం ఏడాదికి 50 వేల కార్నియాలు మాత్రమే సేకరణ జరుగుతోందని, అందులో 27 వేల మార్పిడి శస్త్రచికిత్సలు మాత్రమే నిర్వహించగలుగుతున్నామని వివరించారు. 2011లో సికింద్రాబాద్ క్లాక్ టవర్‌లో దివంగత పద్మశ్రీ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభమైన వాసన్ ఐ బ్యాంక్ ఇప్పటివరకు 14 వేల కార్నియాలను సేకరించి, 8,500 మందికి శస్త్రచికిత్సల కోసం అందించినట్లు తెలిపారు. అలాగే 150 మంది ఐ బ్యాంక్ నిపుణులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసన్ ఐ బ్యాంక్ ఏజీఎం అరవింద్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పచ్చదనంతోనే ఆరోగ్యకరమైన సమాజం

- చెరువు కట్టపై మొక్కలు నాటిన మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి
- పురపాలక కేంద్రంలో ఉత్సాహంగా వనమహోత్సవం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** పచ్చదనాన్ని పెంపొందించడంతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు పచ్చదనంతో కూడిన మంచి వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. మంగళవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక 10వ వార్డు పరిధిలోని చెరువు ఆనకట్టపై వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ అంజన్ రెడ్డి కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. పట్టణంలో పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు శ్రీరామ మంజుల లింగస్వామి, కొండమడుగు ఎల్లస్వామి, రావుల జంగయ్య, పెద్దల చక్రపాణి, బతుక లింగస్వామి యాదవ్, దేవరాయ కుమార్, జింకల లావణ్య యాదగిరి, సురపల్లి రాధికా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వంగూరు పాండుకు ట్రస్మా ఘన సన్మానం

- కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా వేడుక
- అభినందించిన యాదాద్రి జిల్లా ట్రస్మా నేతలు




**తొలివెలుగు, వలిగొండ :** పోచంపల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన కృష్ణవేణి స్కూల్ కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా కోశాధికారి వంగూరు పాండును యాదాద్రి జిల్లా ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భువనగిరి పట్టణంలోని కాకతీయ స్కూల్‌లో మంగళవారం ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్మా ప్రతినిధులు వంగూరు పాండుకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యా రంగంలో సేవలందించడంతో పాటు రాజకీయంగానూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కొత్త బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని అభినందించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పాలకూర వెంకటేశం గౌడ్, కార్యదర్శి దాసరి శ్రీరాములు, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, డాక్టర్ మెరుగు మధు, మల్లికార్జున్, కాసుల వెంకటేశం, జిల్లా నాయకులు ఉగాది సోమిరెడ్డి, తుంగతుర్తి రంగారావు, నరేందర్, దుర్గాప్రసాద్, కృష్ణంరాజు, విజయలక్ష్మి, సంతోషి, రఘు, అఖిల తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే హరిత గ్రామాలు


- గ్రామాలను హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి
- ఆత్మకూర్ (ఎం) మండలంలో ఘనంగా వనమహోత్సవం
- నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

**తొలివెలుగు, ఆత్మకూర్ (ఎం) :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విరివిగా మొక్కలు నాటి గ్రామాలను హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని నాయకులు, అధికారులు పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా ఆత్మకూర్ (ఎం) మండలంలోని ఆత్మకూర్, రాయిపల్లి, సర్వేపల్లి గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, అధికారులు మాట్లాడుతూ.. భావితరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, వాటి పెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవ కార్యక్రమాలను గ్రామాల్లో నిరంతరం కొనసాగిస్తూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు నాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు చందర్ గౌడ్, సర్పంచ్‌లు బీసు ధనలక్ష్మి, అంజయ్య, ఉపసర్పంచ్ వెంకటేష్, ఏపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సభ్యుల పేరిట భర్తల పెత్తనం

- మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో భర్తల జోక్యం తగదు
- అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంపై వార్డు సభ్యుడి అభ్యంతరం
- పోనకల్ జీపీలో చర్చనీయాంశంగా మారిన 'ప్రాక్సీ' వ్యవహారం




**తొలివెలుగు, జన్నారం:** స్థానిక సంస్థల్లో ప్రజలచే ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్తలు పెత్తనం చెలాయించే విధానానికి స్వస్తి పలకాలని పోనకల్ మేజర్ గ్రామపంచాయతీ 11వ వార్డు సభ్యుడు ముడుగు ప్రవీణ్ డిమాండ్ చేశారు. మహిళా వార్డు సభ్యులకు బదులుగా వారి భర్తలు అధికారిక కార్యక్రమాలు, పంచాయతీ సమావేశాల్లో పాల్గొంటున్నారనే ఆరోపణలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం:**

ముడుగు ప్రవీణ్ మాట్లాడుతూ.. స్థానిక పరిపాలనలో మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించి, వారిని నిర్ణయాధికారంలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని తెలిపారు. అయితే ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్తలు సమావేశాలకు హాజరై అధికారిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. మహిళా సభ్యులు స్వయంగా తమ వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, వాటిని పంచాయతీ సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మహిళలకు కల్పించిన రాజకీయ ప్రాతినిధ్యం కేవలం పేరుకే పరిమితం కాకుండా, నిర్ణయాధికారంలోనూ వారికి సముచిత స్థానం ఉండాలని అన్నారు.

**అధికారుల స్పష్టమైన ఆదేశాలు అవసరం:**

గ్రామపంచాయతీ బాధ్యతలు, అధికారిక సమావేశాల్లో ఎవరు పాల్గొనాలి, ప్రజాప్రతినిధుల తరపున ఎవరు ప్రాతినిధ్యం వహించాలనే అంశాలపై పంచాయతీరాజ్ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ప్రవీణ్ కోరారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు దక్కాల్సిన గౌరవం, ప్రాధాన్యత వారికే దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్తల ఆధిపత్యాన్ని అధికారులు తక్షణమే అడ్డుకోవాలని, లేనిపక్షంలో స్థానిక పాలనలో మహిళల ప్రాతినిధ్యం నామమాత్రంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, మహిళా సాధికారతను కాపాడేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ముడుగు ప్రవీణ్ కోరారు.



11వ వార్డు సభ్యుడు
ముడుగు ప్రవీణ్

# పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ



- గ్రామాల్లో ఘనంగా వనమహోత్సవం
- మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకున్న ప్రజాప్రతినిధులు

**తొలివెలుగు, చిట్యాల :** పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. మంగళవారం చిట్యాల మండలంలోని పలు గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలో వనమహోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

**గ్రామాల్లో మొక్కలు నాటిన సర్పంచులు:**

మండలంలోని సుంకెనపల్లి, ఉరుమడ్ల, చిన్నకాపర్తి, బోయగుబ్బ గ్రామాల్లో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు ఆవుల సునీత యాదయ్య, సాగర్ల భానుశ్రీ భిక్షం, ఆవుల సుందర్, రెగులగడ్డ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మొక్కలు నాటి నీరు పోశారు. నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షిస్తూ, వాటి పెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులకు సూచించారు.

**మున్సిపాలిటీలోనూ హరిత కార్యక్రమం:**

చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు పాల్గొని మొక్కలు నాటారు. పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వారు కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ జెల్లా పాండు, ఎంపీఓ అనుముల కోటేష్, ఉపసర్పంచ్ కోసనం శేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు మల్యాల నరేందర్, గుత్తా శ్రీనివాస్‌రెడ్డి, గురిజ మురళి, పంచాయతీ కార్యదర్శులు ఆలేందర్‌రెడ్డి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ప్రజా పాలనలోనే ప్రతి కుటుంబానికి న్యాయం: ప్రభుత్వ విప్ వేముల వీరేశం
- చిట్యాలలో ఉత్సాహంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**తొలివెలుగు, చిట్యాల:చీ** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం చిట్యాల పురపాలక పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిపాలనా వ్యవస్థను మరింత పటిష్టం చేసి, అర్హత ఆధారంగానే లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమకరణ్‌రెడ్డి, తహసీల్దార్ మాద్రేనేని విజయ్‌కుమార్,




ఎంపీడీఓ జెల్లా పాండు, మున్సిపల్ కమిషనర్ ఉప్పల గురులింగం, డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దులపురి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యంతో పండుగ జరుపుకోవాలి






- పోలీస్‌శాఖకు సహకరించాలని సీఐ పిలుపు
- వలిగొండలో పీస్ కమిటీ సమావేశం

**తొలివెలుగు, వలిగొండ :** మిలాద్ ఉన్ నబీ పండుగను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సోదరభావంతో జరుపుకోవాలని రామన్నపేట సీఐ ఎం.రవి సూచించారు. మంగళవారం వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఏ.శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ రవి మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, సోదరభావంతో వ్యవహరిస్తూ మతసామరస్యాన్ని కాపాడాలని కోరారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్‌శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న హిందూ, ముస్లిం మతపెద్దలు పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్‌శాఖకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజలు సోదరభావంతో మెలుగుతూ పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం

- పెద్దకాపర్తి, ఉరుమడ్లలో టీపీయూఎస్ సభ్యత్వ నమోదు
- 26న నల్లగొండలో 'గురువందనం': బుర్రి గోపాల్‌రెడ్డి

**తొలివెలుగు, చిట్యాల :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) నిరంతర పోరాటాలు నిర్వహిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అకాడమిక్ సెల్ కన్వీనర్ బుర్రి గోపాల్‌రెడ్డి తెలిపారు. చిట్యాల మండల పరిధిలోని పెద్దకాపర్తి, ఉరుమడ్ల గ్రామాల్లో మంగళవారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులకు సంఘ సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 26న నల్లగొండలోని రత్న ఫంక్షన్ హాల్‌లో తలపెట్టిన 'గురువందనం' కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ నాయకులు కంచనపల్లి విజయ్‌కుమార్, మిర్యాల మురళి, బూరుగు వెంకటేశ్వర్లు, పులిమామిడి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ తల్లి బోనాలు

- ఖైతాపురంలో వైభవంగా ఉత్సవాలు
- సమృద్ధిగా పంటలు పండాలని వేడుకున్న తగరం సుభాష్ చంద్రబోస్



**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని ఖైతాపురం గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మునుగోడు నియోజకవర్గ నాయకులు తగరం సుభాష్ చంద్రబోస్ పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరికీ సుఖశాంతి, ఆయురారోగ్యాలు ప్రసాదించి, పంటలు సమృద్ధిగా పండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

- 25 క్వింటాళ్ల బియ్యం, వాహనం స్వాధీనం
- చౌటుప్పల్ వద్ద పట్టుకున్న పోలీసులు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** మిర్యాలగూడ పరిసర గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని చౌటుప్పల్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు రవాణాకు ఉపయోగిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అందిన సమాచారం మేరకు ఏఎస్ఐ పి. కరుణాకర్ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ సిబ్బంది పీసీ ఎం. సందీప్, ఏఆర్‌పీసీ ఎల్. సీతారాం రెడ్డిలతో కలిసి వలిగొండ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన ఒక వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో బియ్యం లభ్యమైంది. వాహన డ్రైవర్ లావుద్య శ్రీనివాస్ (30), సహాయకుడు గుగులోతు అరుణ్ (18)లను విచారించగా, మిర్యాలగూడ పరిసర గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో సుమారు 25 క్వింటాళ్ల బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



# ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎర్రోళ్ల శాంతి కుమార్

- చౌటుప్పల్‌లో యాదాద్రి భువనగిరి నూతన కమిటీ ఎంపిక
- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతాం: శాంతి కుమార్



**తొలివెలుగు, చౌటుప్పల్ :** ధర్మ సమాజ్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కార్యవర్గాన్ని చౌటుప్పల్ మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌చార్జి రాసాల వినోద్ యాదవ్, ధర్మ సమాజ్ పార్టీ యాదాద్రి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర నాయకుడు నల్లా నరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ ఎన్నికలు నిర్వహించారు. ధర్మ సమాజ్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా ఎర్రోళ్ల శాంతి కుమార్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాసాల అశోక్ యాదవ్, కొంగరి లింగస్వామి, సుదెల మహేష్, ప్రధాన కార్యదర్శిగా వెలువర్తి శ్రీకాంత్‌ను ఎంపిక చేశారు. జిల్లా కార్యదర్శులుగా బి.ఆర్. సాయి కుమార్, ఏర్పుల సురేష్, కొమ్ము సాయికిరణ్, బందెల రవి ఎన్నికయ్యారు. జిల్లా మీడియా ఇన్‌చార్జిలుగా పంది నగేష్, నార్కట్‌పల్లి సుధాకర్‌ను నియమించారు. మాదిగ జాగృతి సంఘం జిల్లా నాయకుడిగా గడ్డం జలంధర్‌ను ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం:**

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. నూతన జిల్లా కమిటీ ఎల్లవేళలా ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు జిల్లాలో పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల శాంతి కుమార్ మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్. మహేష్, సి.హెచ్. సాయి కుమార్, నరేందర్, గణేష్, సందీప్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ అసోసియేషన్ ఎన్నికల్లో నాగరాజు ఘన విజయం

- చౌటుప్పల్ ఠాణాలో ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ
- 16 ఓట్లతో విజేతగా నిలిచిన కె. నాగరాజు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో కె. నాగరాజు (పీసీ-3685) 16 ఓట్లు సాధించి విజేతగా నిలిచారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో ఠాణా పరిధిలోని అర్హత కలిగిన పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చౌటుప్పల్ సీఐ జి. మన్మథ కుమార్ ఎన్నికల నిర్వహణాధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీపడ్డారు. కె. నాగరాజు 16 ఓట్లు సాధించి విజయం సాధించగా, పి. శ్రీను (పీసీ-4618), వి. శ్రీనివాస్ (హెచ్‌సీ-1843), వి. వీర కృష్ణ (పీసీ-96), వి. ఉపేందర్ (పీసీ-181) పోటీలో ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించినట్లు సీఐ జి. మన్మథ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన కె. నాగరాజును సీఐ జి. మన్మథ కుమార్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.





## పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

- అల్లాపురంలో ఉత్సాహంగా వనమహోత్సవం
- సర్పంచ్ టేకుల మంజుల దిలీప్‌రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** చెట్లను విచ్చలవిడిగా నరికివేస్తూ వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటకపోవడం వల్లే 'ఎల్‌నినో' వంటి వాతావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అల్లాపురం గ్రామ సర్పంచ్ టేకుల మంజుల దిలీప్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ మండలంలోని అల్లాపురం గ్రామంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల దిలీప్‌రెడ్డి స్వయంగా మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. పచ్చదనం పెరిగినప్పుడే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోయిని లింగస్వామి, వార్డు సభ్యులు సామ సుమిత్ర పెద్దిరెడ్డి, యంజాల శ్రీకాంత్, భూతం లింగస్వామి, గ్రామ కార్యదర్శి సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ స్వర్ణ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం





- చౌటుప్పల్ 13వ వార్డులో ఘనంగా వనమహోత్సవం
- మొక్కలు నాటిన మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'వనమహోత్సవం-2026'లో భాగంగా మంగళవారం చౌటుప్పల్ పట్టణంలోని 13వ వార్డు జయభూమి వెంచర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.

**పట్టణ పచ్చదనాన్ని కాపాడుకోవాలి:**

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పావని మాట్లాడుతూ.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో 30 శాతం అటవీ ప్రాంతం ఉందని, దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు మొక్కలు నాటడాన్ని అలవాటుగా మార్చుకోవాలని కోరారు. స్థానిక కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ మాట్లాడుతూ.. మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను సమాజంలోని ప్రతి ఒక్కరూ స్వీకరించాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోసనం రాకేష్‌రెడ్డి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, పాక చిరంజీవి, పిల్లలమర్రి మధుసూదన్, కో-ఆప్షన్ సభ్యుడు పస్తం గంగారాములు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఊడుగు రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, మేనేజర్ అంజయ్య, ఫారెస్ట్ అధికారి మెహరాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, ఐరా పబ్లిక్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ బి. మమత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# మళ్లీ చైనా పెట్టుబడులు!

**3 నెలల్లోనే దేశంలోకి రూ.5,000 కోట్లు రాక**

న్యూఢిల్లీ, ఆగస్టు 24: గత కొన్నేండ్లుగా భారత్‌లోకి ఆగిన చైనా ఆధారిత పెట్టుబడులు మళ్లీ మొదలవుతున్నాయి. సరిహద్దుల్లో గల్వాన్ వద్ద ఇరు దేశాల సైనికుల కొట్లాట, చైనా దుశ్చర్యను ఖండిస్తూ 2020 ఏప్రిల్‌లో దేశంలోకి డ్రాగన్ పెట్టుబడులకు కేంద్రం నో ఎంట్రీ బోర్డు పెట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది మార్చిలో మోదీ సర్కార్ ఈ వైఖరిలో కొంత మెత్తబడింది. ఇందుకు సంబంధించి దాదాపు ఆరేండ్లుగా అనుసరించిన కఠిన విధానాన్ని సడలించింది. ఇలా జరిగిన కేవలం 3 నెలల వ్యవధిలోనే సుమారు రూ.5,000 కోట్ల విదేశీ పెట్టుబడులు మారిన నిబంధనలకు అనుగుణంగా దేశంలోకి రావడం గమనార్హం. మరోవైపు వచ్చే నెలలో భారత్‌లో బ్రిక్స్ దేశాల సదస్సు జరుగనున్న క్రమంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సోమవారం బీజింగ్‌కు వెళ్లారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సరిహద్దు చర్చలు, బ్రిక్స్ సమావేశాలకు ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ వచ్చే వీలుండటంతో చేపట్టాల్సిన సన్నాహాలపై మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో భారత్‌లోకి చైనా పెట్టుబడుల వార్తలు ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. నిజానికి 2024 ద్వితీయార్ధం నుంచే భారత్-చైనా మధ్య నేరుగా విమాన రాకపోకలు మొదలయ్యాయి. వ్యాపార నిమిత్తం ప్రయాణాలు, సరిహద్దు వాణిజ్యం, దౌత్యపరమైన సంబంధాలు బలోపేతమయ్యాయి. ఈ క్రమంలో వాంగ్ యీతో భారత విదేశాంగ మంత్రి ఎస్ జయశంకర్ ఇటీవల రాజకీయపరంగానేగాక మార్కెటింగ్ అనుమతులు, ఎగుమతులు-దిగుమతులు, వాణిజ్య లోటు గురించి చర్చలు కూడా జరిపారు. దీంతో ఇక భారత్‌లోకి చైనా పెట్టుబడుల ప్రవాహం పుంజుకోవచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో పెరిగే చైనా పెట్టుబడులు.. స్వదేశీ ఉత్పాదకతను దెబ్బతీయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మేక్ ఇన్ ఇండియాకు గట్టి దెబ్బేనన్న వాదనలూ లేకపోలేదు.

# నయా పల్సర్

**ప్రారంభ ధర రూ.92,900**



ముంబై, ఆగస్టు 24: బజాజ్ ఆటో.. దేశీయ మార్కెట్‌కు నయా పల్సర్ బైకులను పరిచయం చేసింది. వీటిలో రూ.92,900 ధర కలిగిన పల్సర్ 125, రూ.1.15 లక్షల విలువైన పల్సర్ 150ను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ రాకేశ్ శర్మ మాట్లాడుతూ..వచ్చే పండుగ సీజన్‌పై ఆశావాదంగా ఉన్నట్టు, ప్రధానంగా ఈ నూతన బైకులు కొనుగోలుదారులను ఆకట్టుకునే అవకాశాలున్నాయన్నారు. పాత బైకులతో పోలిస్తే ఈ నయా బైకులను నూతన ఫీచర్లు, టెక్నాలజీ పరంగా మార్పులు చేసినట్టు చెప్పారు. వచ్చే పండుగ సీజన్‌లో మూడు కొత్త బైకులు, నూతన బ్రాండ్‌ను పరిచయం చేయబోతున్నట్టు ఆయన ప్రకటించారు. గత త్రైమాసికంలో వాహన ధరలను పెంచినప్పటికీ డిమాండ్ మాత్రం పడిపోలేదని, వచ్చే త్రైమాసికాల్లో పెరిగే అవకాశం ఉందన్నారు.

## టీసీఎస్ రూ. 3,574 కోట్ల డీల్..

సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ(టీసీఎస్) తాజాగా జర్మనీ స్పోర్ట్స్ కార్ల తయారీ దిగ్గజం పోర్షే ఏజీకి చెందిన ఐటీ యూనిట్ కొనుగోలుకి ఒప్పందం కుదుర్చుకుంది. పోర్షే అనుబంధ సంస్థ ఎంహెచ్‌పీ మేనేజ్‌మెంట్--యూఎన్‌డీ ఐటీ--బెరాటంగ్ జీఎంబీహెచ్ (ఎంహెచ్)లో 100% వాటా సొంతం చేసుకోనున్నట్లు టీసీఎస్ పేర్కొంది. 32 కోట్ల యూరోల(రూ. 3,574 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువలో డీల్ కుదిరినట్లు వెల్లడించింది. తాజా కొనుగోలు జర్మన్ దిగ్గజంతో 1.25 బిలియన్ యూరోల విలువైన ఐదేళ్ల వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగమని తెలిపింది. సొంత అనుబంధ కంపెనీ టీసీఎస్ నెదర్లాండ్స్ బీవీ ద్వారా ఎంహెచ్‌పీని కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. కాగా.. ప్రభుత్వ రంగంతోపాటు ఆటోమోటివ్, తయారీ, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎనర్జీ రంగాల్లో మేనేజ్‌మెంట్, ఐటీ కన్సల్టెన్సీ సేవలను ఎంహెచ్‌పీ అందిస్తోంది. కంపెనీ సిబ్బంది సంఖ్య 4,500కాగా.. 2025లో 74.2 కోట్ల యూరోల ఆదాయం ఆర్జించింది. తాజా సహకారంలో భాగంగా పోర్షే కోసం ప్రత్యేకించిన ఏఐ మొబిలిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(కేంద్రాన్ని) టీసీఎస్ ఏర్పాటు చేయనుంది. ఏఐ, సాఫ్ట్‌వేర్, డేటా ద్వారా ఆటోమోటివ్ పరిశ్రమలో మార్పులకు తెరలేవనున్న నేపథ్యంలో టీసీఎస్‌కున్న ఏఐ, ఇంజినీరింగ్, టెక్, బిజినెస్ ట్రాన్స్‌ఫార్మేషన్ సామర్థ్యాలకు ఎంహెచ్‌పీకిగల పటిష్ట ఆటోమోటివ్ కన్సల్టింగ్ నైపుణ్యాలు జతవనున్నాయి. రెండింటి సమన్వయంతో పోర్షేకు ఏఐని మరింత విస్తృతంగా అందించనున్నట్లు టీసీఎస్ సీఈవో కె.కృతివాసన్ చెప్పారు.




# తులం రూ.1.64 లక్షలు..
# ఐదు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకున్న పుత్తడి ధర

న్యూఢిల్లీ, ఆగస్టు 24 : బంగారం ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. గత కొన్ని రోజులుగా పుంజుకుంటు వచ్చిన పుత్తడి సోమవారం ఐదు నెలల గరిష్ఠ స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పెరుగడంతోపాటు అమెరికా-ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు రోజురోజుకూ ముదురుతుండటంతో మదుపర్లు తమ పెట్టుబడులను సురక్షితమైన గోల్డ్ వైపు మళ్లించడంతో వీటి ధరలు పుంజుకుంటున్నాయి. అంతర్జాతీయ పరిణామాలతోపాటు దేశీయంగా పండుగ సీజన్ కూడా ప్రారంభంకావడంతో అమ్మకాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల గోల్డ్ ధర రూ.1.64 లక్షలు దాటింది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి 99.9 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.900 ఎగబాకి రూ.1,64,400 పలికింది. గత వారంలో రూ.1,63,500గా ఉన్నది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. మార్చి 9న నమోదైన రూ.1,64,300 తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి కావడం విశేషం.



**వెండి మరో రూ.3,500**

బంగారంతోపాటు వెండి ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతోపాటు రిటైల్ విక్రయాలు అధికమవడంతో కిలో వెండి రూ.2.53 లక్షలు దాటింది. గతవారం ముగింపుతో పోలిస్తే రూ.,3500 ఎగబాకి రూ.2,53,500 పలికింది. వరుసగా మూడు రోజులుగా వెండి రూ.10 వేలకు పైగా ఎగబాకినట్టు అయింది. అలాగే ఏప్రిల్ 17న నమోదైన రూ.2.53 లక్షల తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి. డాలర్ బలహీనపడటంతో ధరలు పెరిగాయని కొటక్ సెక్యూరిటీస్ రీసర్చ్ హెడ్ కైనత్ చైనావాలా తెలిపారు. రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం, ద్రవ్యోల్బణ భయాలు కూడా ధరలు పెరుగడానికి కారణాలన్నారు. గోల్డ్ ధర 42.45 డాలర్లు లేదా ఒక్క శాతం ఎగబాకి 4,646.54 డాలర్లకు చేరుకోగా, వెండి 69 డాలర్ల వద్ద ఉన్నది.

# మార్కెట్లలో మురిపించిన రికవరీ




గత కొన్ని రోజులుగా ఆచితూచి అడుగులు వేస్తున్న భారత స్టాక్ మార్కెట్ ఈరోజు ఆరంభంలో నష్టాల్లోకి జారినా మార్కెట్ ముగిసే సమయానికి 'అంతకంటే తీపి లేదు' అన్నట్లుగా ఆశాజనక వాతావరణంలో లాభాల బాట పట్టింది. ఆగస్టు 25, 2026 నాటి ట్రేడింగ్‌లో దేశీయ ప్రధాన సూచీలు రికవరీని సాధించాయి. తీవ్ర ఒడుదొడుకుల మధ్య సాగిన ఈనాటి సెషన్‌లో నిఫ్టీ 115 పాయింట్లు పుంజుకొని 24,334 వద్ద ముగియగా, సెన్సెక్స్ 286 పాయింట్లు ఎగబాకి 77,656 పాయింట్ల స్థాయికి చేరింది. అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలతో ఉదయం అడుగడుగునా గండం అన్నట్లు ప్రారంభమైన మార్కెట్లు, మధ్యాహ్న సమయానికి కొనుగోళ్ల మద్దతుతో ఊపందుకున్నాయి. పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు, ఇరాన్‌పై అమెరికా తాజా ఆంక్షల హెచ్చరికల నేపథ్యంలో క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు పైగా ట్రేడ్ అవ్వడం మన మార్కెట్లను మొదట్లో భయపెట్టింది. అయితే అంతర్జాతీయంగా అమెరికా బాండ్ ఈల్డ్స్ తగ్గడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ మున్ముందు వడ్డీ రేట్ల తగ్గింపుపై సానుకూల ధోరణి కనబరచవచ్చన్న అంచనాలు మార్కెట్‌కు ఊపిరి పోశాయి.

**మద్దతుగా విదేశీ నిధులు**


ఇన్వెస్టర్లు సురక్షితమైన లార్జ్‌క్యాప్ కంపెనీల వైపే మొగ్గు చూపారు. విదేశీ రంగానికి చెందిన ప్రముఖ కంపెనీల షేర్లలో భారీగా సాగిన షార్ట్ కవరింగ్, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టైటాన్, ఎయిర్‌లైన్ దిగ్గజం ఇండిగో షేర్లు లాభాలు.. వంటివి సూచీల రికవరీకి కారణమయ్యాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తిరిగి నికర కొనుగోలుదారులుగా మారడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది.

**విశ్లేషకుల అభిప్రాయం**

అంతర్జాతీయ జియోపొలిటికల్ ఉద్రిక్తతలు 'చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లు' తాత్కాలికంగా ఇన్వెస్టర్లలో ఆందోళన రేపినా భారత ఆర్థిక వ్యవస్థలోని బలమైన ప్రాథమిక సూచికలు ఆసియా మార్కెట్లలో మన స్థానాన్ని మళ్లీ అగ్రభాగాన నిలబెడుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో క్రూడ్ ఆయిల్ ధరల ఊగిసలాటపై దృష్టి పెట్టాలని, గుడ్డిగా పెట్టుబడులు పెట్టకుండా 'అడుసు తొక్కనేల.. కాలు కడగనేల' అన్న రీతిలో ముందస్తు వ్యూహంతో అడుగులు వేయాలని సూచిస్తున్నారు.

# ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తుంటే జాగ్రత్త!

భారతీయులకు అత్యంత సురక్షితమైన, నమ్మకమైన పెట్టుబడి మార్గం అనగానే ముందు గుర్తొచ్చేది ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ). స్థిరమైన రాబడి కోసం మెజారిటీ ప్రజలు ఎఫ్‌డీలనే ఆశ్రయిస్తుంటారు. అయితే, ఎలాంటి ముందస్తు ప్రణాళిక, పరిశోధన లేకుండా నిశ్చింతగా చేసే ఎఫ్‌డీ పెట్టుబడులు ఒక్కోసారి అసలుకే ఎసరు తెచ్చి తీవ్ర నిరాశను మిగిల్చే అవకాశం ఉంది. ఎఫ్‌డీల్లో డబ్బు దాచే ముందు ప్రతీ పెట్టుబడిదారు తప్పక గుర్తుంచుకోవాల్సిన ఐదు కీలకమైన పొరపాట్లు, వాటి పరిష్కారాలు ఇక్కడ పరిశీలిద్దాం.. ఎఫ్‌డీలపై వచ్చే వడ్డీ రాబడి పూర్తిగా పన్ను పరిధిలోకి వస్తుంది. మీ ఇన్‌కమ్ టాక్స్ స్లాబ్ ప్రకారమే పన్ను వర్తిస్తుంది. ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రూ.40,000 (సీనియర్ సిటిజన్లకు రూ.50,000) దాటితే బ్యాంకులు మూలం వద్దే పన్ను మినహాయింపు (టీడీఎస్) చేస్తాయి. టాక్స్ పరిగణనలోకి తీసుకోకుండా వచ్చే వడ్డీ మొత్తాన్ని నికర లాభంగా భావించడం పెద్ద పొరపాటు.




**ద్రవ్యోల్బణం ప్రభావాన్ని అంచనా వేయకపోవడం**

ద్రవ్యోల్బణం పెరిగే కొద్దీ రూపాయి కొనుగోలు శక్తి వేగంగా తగ్గుతుంది. మీ ఎఫ్‌డీ వడ్డీ రేటు 7 శాతం ఉండి, మార్కెట్లో ద్రవ్యోల్బణం కూడా 6--7% ఉంటే.. పన్నులు పోను మీ నికర వాస్తవ రాబడి సున్నాకే సమానం. కేవలం ఎఫ్‌డీలపైనే ఆధారపడకుండా ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే ఇతర మార్గాలనూ పరిశీలించాలి.

**గడువుకు ముందే ఉపసంహరణ**

అత్యవసర నిధి వేరుగా ఉంచుకోకుండా మొత్తం సొమ్మును దీర్ఘకాలిక ఎఫ్‌డీల్లో పెడితే హఠాత్తుగా డబ్బు అవసరమైనప్పుడు ఎఫ్‌డీని గడువు తీరకుండానే ఉపసంహరించుకోవాల్సి వస్తుంది. దీనివల్ల బ్యాంకులు 0.5%-1% వరకు జరిమానా విధించడమే కాకుండా వడ్డీ రేటును తగ్గిస్తాయి.

**ఎఫ్‌డీ లాడరింగ్ విధానం పాటించకపోవడం**

మొత్తం సొమ్మును ఒకే ఎఫ్‌డీలో ఒకే కాలపరిమితికి లాక్ చేయడం వల్ల భవిష్యత్తులో వడ్డీ రేట్లు పెరిగినప్పుడు ఆ అవకాశాన్ని కోల్పోతారు. అలాకాకుండా సొమ్మును విడదీసి వేర్వేరు గడువులతో (1 సంవత్సరం, 2 ఏళ్లు, 3 ఏళ్లు) డిపాజిట్ చేసే లాడరింగ్ పద్ధతి పాటిస్తే ద్రవ్యలభ్యత పెరగడంతో పాటు అధిక రాబడి లభిస్తుంది.



## తన 'శివాజీ'తో ఉమాదేవి.. మళ్ళీ రిపీట్ చేస్తున్నారా?

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నటించిన రికార్డు బ్రేకింగ్ హిట్ చిత్రాల్లో మావెరిక్ దర్శకుడు శంకర్ కలయికలో చేసిన మొదటి చిత్రం 'శివాజీ' కూడా ఒకటి. ఈ సినిమాలో సూపర్ స్టార్ సరసన అప్పటికి యంగ్ హీరోయిన్ గా పేరొందిన శ్రేయ నటించింది. పైగా సినిమాలో ఆమెది ఎంతో కీలక పాత్ర కూడా. ఇలా ఆ చిత్రంతో ఇద్దరి జంట ఇప్పటికీ చెరగని ముద్ర వేసుకుంది. శివాజీ, ఉమాదేవిగా అదరగొట్టిన వీరు మళ్ళీ ఆ సినిమా తర్వాత వీరి కాంబినేషన్ రాలేదు. అయితే దాదాపు 19 ఏళ్ళు తర్వాత మళ్ళీ ఈ ఇద్దరూ కలిసి నటిస్తున్నారా అనే టాక్ ఇపుడు మొదలైంది. తాజాగా తన రజినీకాంత్ తో కలిసి ఆమె దిగిన ఫొటో ఆమె షేర్ చేసుకుంది. ఇక ఇందులో రజినీకాంత్ తన కొత్త చిత్రం 'ధర్మన్' లుక్స్ లో కనిపించడంతో ఆమె ఈ సినిమాలో ఉందా అనే టాక్ ఇప్పుడు మొదలైంది. సో ఇలా తమ మధ్య దిగిన ఈ స్పెషల్ పిక్ వైరల్ గా మారింది.





## జయరాం, సిమ్రాన్‌ల పెళ్లి ఫొటో..

సీనియర్ నటులు జయరాం, సిమ్రాన్ రహస్యంగా వివాహం చేసుకున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. అయితే, ఈ ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని తేలింది. వైరల్ అవుతున్న ఆ దృశ్యాలు కేవలం ఒక నూతన చిత్ర ప్రారంభోత్సవానికి సంబంధించినవని స్పష్టమైంది. వైరల్ అవుతున్న ఫొటోలలో జయరాం తెల్లటి పంచెలో, సిమ్రాన్ ఎరుపు రంగు పట్టుచీర ధరించి మెడలో పూలమాలలతో కనిపించారు. ఈ వేషధారణ చూసి చాలామంది నెటిజన్లు వారికి నిజంగానే వివాహం జరిగిందని భావించి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. అయితే, వాస్తవాలను సరిచూసుకోకుండా ఇలాంటి వార్తలను ప్రచారం చేయడం సరికాదని, ఇది సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలను ఇబ్బందుల్లోకి నెడుతుందని మరికొందరు అభిప్రాయపడ్డారు. వాస్తవానికి జయరాం, సిమ్రాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఓ నూతన చిత్ర ప్రారంభోత్సవం ఇటీవల ఘనంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమానికి హాజరైన నటీనటులను చిత్ర బృందం సంప్రదాయబద్ధంగా పూలమాలలతో సత్కరించింది. ఆ సమయంలో తీసిన ఫొటోలనే కొందరు వక్రీకరించి, అవి వారి పెళ్లి ఫొటోలంటూ సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేశారు. విషయం తెలిసిన కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో కొందరు కావాలనే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు.

## కియారాకి మరో ఫ్లాప్ మిస్..

బాలీవుడ్ గ్లామరస్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ కియారా అద్వానీ తెలుగులో చేసిన కొన్ని సినిమాలు కూడా ఆమెకి నిరాశనే మిగిల్చాయి. భరత్ అనే నేను తో సాలిడ్ వెల్కమ్ అందుకున్న కియారాకి తర్వాత లక్ కలిసి రాలేదు. ఇక మొదటిసారి కన్నడలో తన అదృష్టాన్ని ఆమె పరీక్షించుకునేందుకు సిద్ధం అయ్యింది. అయితే కియారా ఈ గ్యాప్ లో ఓ తమిళ్ ఫ్లాప్ నుంచి లక్కీగా బయటపడింది. ఆ సినిమానే ఎల్ ఐ కే (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ). దర్శకుడు విగ్నేష్ శివన్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని తన భార్య నయనతార నిర్మాణం వహించింది. అయితే ఈ సినిమాలో హీరోయిన్ గా కృతి శెట్టి పాత్రలో మొదట కియారానే తాను సంప్రదించాను. కానీ ఆమె చేయలేదని, ఆమె చెయ్యకపోవడమే ఆమెది మంచిది అయ్యిందని టాక్సిక్ తమిళ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో తాను చెప్పడం ఇపుడు వైరల్ గా మారింది. దీనితో తన సినిమాని తానే ట్రోల్ చేసుకుంటూ విగ్నేష్ శివన్ నిజాన్ని ఒప్పుకోవడంతో కోలీవుడ్ ఆడియెన్స్ ఈ కామెంట్స్ ని మరింత వైరల్ చేస్తున్నారు.




## 19 ఏళ్లకే విశ్వసుందరి పోటీలకు.. కేరళ లా విద్యార్థిని కాజియా ఘనత

కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' కిరీటాన్ని సొంతం చేసుకుంది. ఆగస్టు 23, ఆదివారం జైపూర్‌లోని జీ స్టూడియోస్‌లో అట్టహాసంగా జరిగిన ఫైనల్స్‌లో ఆమె విజేతగా నిలిచింది. ఈ విజయంతో, నవంబర్‌లో ప్యూర్టోరికోలో జరగనున్న 75వ మిస్ యూనివర్స్ అందాల పోటీల్లో ఆమె భారతదేశానికి ప్రాతినిధ్యం వహించనుంది. రాష్ట్రస్థాయి పోటీలు, ఆడిషన్లు, గ్రూమింగ్ రౌండ్ల తర్వాత ఫైనల్స్‌కు చేరిన 52 మంది పోటీదారుల నుంచి కాజియా విజేతగా నిలిచింది. గత ఏడాది విజేత మణిక విశ్వకర్మ ఆమెకు కిరీటాన్ని అలంకరించింది. ఈ పోటీల్లో తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్ ఫస్ట్ రన్నరప్‌గా నిలవగా, ఆమెకు 'మిస్ ఇంటర్నేషనల్ ఇండియా 2026' టైటిల్ కూడా దక్కింది. గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సతవలేకర్ సెకండ్ రన్నరప్‌గా నిలిచింది. కేరళలోని అలప్పుళ జిల్లా మావెలిక్కర ప్రాంతానికి చెందిన కాజియా, ప్రస్తుతం లా చదువుతూనే మోడలింగ్‌లో రాణిస్తోంది. ఆమె తన చిన్నతనం ఎక్కువ భాగం అబుదాబిలో గడిపింది. అక్కడి ఎమిరేట్స్ నేషనల్ స్కూల్, సెయింట్ జోసెఫ్స్ స్కూల్, అబుదాబి ఇండియన్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసింది. విభిన్న సంస్కృతుల మధ్య పెరగడం ఆమె ఆత్మవిశ్వాసానికి, వాక్చాతుర్యానికి దోహదపడింది. కాజియా తన కెరీర్‌లో వేగంగా ఉన్నత స్థాయికి చేరుకుంది. 17 ఏళ్ల వయసులోనే 'మిస్ టీన్ దివా 2024' టైటిల్ గెలుచుకుంది. 2025లో 'మిస్ టీన్ ఇంటర్నేషనల్' పోటీల్లో భారత్ తరఫున పాల్గొని ఫస్ట్ రన్నరప్‌గా నిలిచింది. ఈ ఏడాది ప్రారంభంలో 'మిస్ యూనివర్స్ కేరళ' టైటిల్‌ను అతి పిన్న వయసులో గెలుచుకొని రికార్డు సృష్టించింది. పదేళ్లకు పైగా శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందడంతో పాటు డ్రమ్స్, వయోలిన్ వాయించడంలోనూ ఆమెకు ప్రావీణ్యం ఉంది. మలయాళ చిత్రం 'షైలాక్'లో కూడా ఆమె చిన్న పాత్రలో కనిపించింది. గెలుపు అనంతరం కాజియా మాట్లాడుతూ "ప్రపంచ శిఖరాన ఉన్నంత ఆనందంగా ఉంది. ఈ కిరీటాన్ని కేరళకు తీసుకెళ్లి, నా సొంత ఊరిని ప్రపంచానికి చూపించగలుగుతున్నందుకు సంతోషంగా ఉంది" అని పేర్కొంది. మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్, ఊర్వశీ రౌతేలా, రియా సింఘా, సెలీనా జైట్లీ వంటి ప్రముఖులు ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రస్తుతం కాజియా, అంతర్జాతీయ పోటీల కోసం స్టైలింగ్, ఫిట్‌నెస్, పబ్లిక్ స్పీకింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకోనుంది. ఇటీవలి కాలంలో ఈ టైటిల్ గెలిచిన అతి పిన్న వయస్కురాలిగా, ప్రస్తుత ఫ్రాంచైజీ కింద మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని గెలుచుకున్న తొలి కేరళ యువతిగా ఆమె నిలిచింది.

## 'దృశ్యం 4' వచ్చేస్తోంది..

**మరోసారి మోహన్‌లాల్, జీతూ జోసెఫ్ మ్యాజిక్!**

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌కు సరికొత్త నిర్వచనం ఇచ్చిన 'దృశ్యం' ఫ్రాంచైజీ నుంచి అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు వచ్చిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించగా, తాజాగా ఈ ఫ్రాంచైజీలో నాలుగో భాగంగా 'దృశ్యం 4' (ఐతీఅంష్ట్రఝఎ 4) తెరకెక్కనున్నట్లు చిత్ర ప్రముఖ నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ అధికారికంగా ప్రకటించారు. మలయాళ దిగ్గజ నటుడు మోహన్‌లాల్ మరోసారి తన అత్యంత శక్తివంతమైన, ప్రేక్షకులను ఎంతగానో కట్టిపడేసిన 'జార్జ్‌కుట్టి' పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన 'దృశ్యం 3' బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించడంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను సరికొత్త ఉత్కంఠలోకి నెట్టింది. ఈ నేపథ్యంలో కేరళలో జరిగిన ఓ ప్రతిష్టాత్మక అవార్డు వేడుకలో పాల్గొన్న నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ మాట్లాడుతూ.. 'దృశ్యం 4' చిత్రాన్ని కచ్చితంగా నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సిరీస్‌ను అద్భుతమైన మలుపులతో నడిపించిన మాస్టర్ మైండ్ డైరెక్టర్ జీతూ జోసెఫ్ ఈ చిత్రానికి కూడా దర్శకత్వం వహించనుండటంతో అంచనాలు అంబరాన్ని అంటుతున్నాయి. మొదటి భాగం నుంచి ప్రతి సీక్వెల్‌లోనూ తన కుటుంబాన్ని కాపాడుకోవడం కోసం జార్జ్‌కుట్టి పోలీసులను, చట్టాన్ని ఏ విధంగా బురిడీ కొట్టించాడనే కథాంశాలు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచాయి. ఇప్పుడు నాలుగో భాగం ప్రకటన రావడంతో.. జార్జ్‌కుట్టి ఈసారి ఏ స్థాయి సవాళ్లను ఎదుర్కోబోతున్నాడు, ఎలాంటి మైండ్-బ్లోయింగ్ ట్విస్టులతో కథను నడిపించనున్నాడనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. త్వరలోనే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలు, నటీనటులు మరియు షూటింగ్ షెడ్యూల్ అధికారికంగా వెల్లడి కానున్నాయి.



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com